

ఏసీబీ విచారణకు బయలుదేరే ముందు తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు

# స్థానికంలో మట్టి కరిపిద్దాం

> ఈ బద్నాం కార్యక్రమం ఇంకా ఎన్ని రోజులు నడుపుతావ్. నేను తప్పు చేయలేదు. నా నిజాయితీకి ధైర్యం ఎక్కువ కాబట్టి ఈ దేశంలో ఏ రాజకీయ నాయకుడు సాహసించని విధంగా లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమని చెప్పా. రేవంత్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే రావాలని సవాల్ చేస్తే పారిపోయిండు. -కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

ఎనిమిదిన్నర గంటలకుపైగా విచారణను ఎదుర్కొన్నారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తాను ఏ తప్పూ చేయలేదని, తల దించుకునే పని అస్సలే చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రతిష్ఠను ఆకాశమంత ఎత్తుకు తీసుకుపోయే పని చేశానే కానీ, తప్పు చేయలేదని స్పష్టంచేశారు. ఫార్ములా-ఈ కార్ రేసు గురించి నాలుగు గోడల మధ్య కాకుండా నాలుగు కోట్ల ప్రజల ముందు, అసెంబ్లీలో చర్చిద్దామంటే సీఎం రేవంత్‌రెడ్డి పారిపోయిండని విమర్శించారు. 'ఈ బద్నాం కార్యక్రమం ఇంకా ఎన్ని రోజులు నడుపుతావ్. నేను తప్పు చేయలేదు. నా నిజాయితీకి ధైర్యం ఎక్కువ కాబట్టి ఈ దేశంలో ఏ రాజకీయ నాయకుడు సాహసించని విధంగా లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమని చెప్పా. రేవంత్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే రావాలని సవాల్ చేస్తే పారిపోయిండు' అని ఎద్దేవా చేశారు. ఫార్ములా-ఈ కేసులో ఏమీ లేకపోయినా మరోసారి పిలిస్తే చట్టాలను గౌరవించే వ్యక్తులుగా, న్యాయస్థానాలపై నమ్మకం ఉన్న వ్యక్తులుగా విచారణకు వచ్చినట్టు చెప్పారు.

### చిట్టినాయుడు రాసిచ్చిన ప్రశ్నలే అవి

మొదటి సంవత్సరం ఫార్ములా-ఈ రేసు విజయవంతం కావడంతో రెండో సంవత్సరం కూడా హైదరాబాద్‌లోనే దానిని నిర్వహించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకున్నదని కేటీఆర్ తెలిపారు. అందులో భాగంగానే నిర్వహణ సంస్థ బ్యాంకు ఖాతాకు డబ్బులు పంపించాను తప్పితే ఒక్క రూపాయి కాదు కదా, పైసా అవినీతి కూడా జరగలేదని పునరుద్ఘాటించారు. ఇదే విషయాన్ని ఏసీబీ అధికారులకు వివరించానని తెలిపారు. 'ఇక్కడ్నుంచి పైసా అక్కడికి పోయింది. అది ఆడనే ఉన్నది. మరి అవినీతి ఎక్కడ ఉందని నేను అధికారులను ప్రశ్నిస్తే వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు' అని చెప్పారు. 'ఫైలు ఎటుపోయింది? నువ్ కుడిచేతులకెళ్లి ఇచ్చినవా? ఎడమ చేతిలకెళ్లి ఇచ్చినవా? అని పనికిమాలిన ప్రశ్నలు. చిట్టినాయుడు రాసిచ్చిన ప్రశ్నలే తప్ప వాటిలో విషయంలేదు' అని విచారణ తీరును ఎండగట్టారు. 'నేను మొన్ననే చెప్పినా, మళ్లీ చెప్తున్నా. ఇదొక లొట్టపీసు కేసు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అసలు కరప్షనే జరగని ఓ తుపేల్, లొట్టపీసు కేసులో ఏసీబీని ఇన్వాల్వ్ చేయడాన్ని తన 26 ఏండ్ల పోలీస్ కెరీర్‌లో చూడనే లేదని మాజీ ఐపీఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు.



**ఆత్మీయ ఆలింగనం** | తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును ఆలింగనం చేసుకుంటున్న కేటీఆర్

> నాపై ఇప్పటికే 14 కేసులు పెట్టావ్. ఇంకా 1400 కేసులు పెట్టుకో. అవసరమైతే జైల్లో పెట్టుకో. భయపడేది లేదు. తెలంగాణ కోసం ఆనాడు జైలుకు పోయినం. తెలంగాణ ప్రతిష్ఠ పెంచడానికి తీసుకున్న ఒక నిర్ణయం వల్ల మళ్లా జైలుకు పోవడానికి కూడా సిద్ధమే. - కేటీఆర్

> 2019 జూన్ 21న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ఆరు సంవత్సరాలు అవుతున్నది. ఈ సందర్భంగా కాళేశ్వరం గొప్పదనాన్ని ప్రజలకు తెలియచేయడానికి రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలి. - కేటీఆర్

### అక్రమ కేసుల్లో ఇరికించాలనే దురాలోచన

'ఆయనకు ఉన్నదంతా ఒక్కటే షోకు. ఓ తప్పుడు పనిచేసి అడ్డంగా దొరికి, నెల రోజులు జైల్లో ఉన్నాడు. కాబట్టి వాళ్లను కూడా ఏదో ఒక కేసులో ఇరికించి జైలుకు పంపాలన్న ఆలోచనతో రేవంత్‌రెడ్డి ఉన్నాడు' అని కేటీఆర్ పేర్కొన్నారు. అందులో భాగంగానే తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను, మాజీ మంత్రి హరీశ్‌రావును కాళేశ్వరం కమిషన్‌తో ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. 'ప్రపంచంలోనే అతి గొప్ప ప్రాజెక్టుగా కాళేశ్వరాన్ని నిర్మిస్తే అందులో చేయని తప్పుకు కేసీఆర్, హరీశ్‌రావుని కమిషన్ ముందుకు పిలిచి, వాళ్లను అక్కడ ఇబ్బంది పెట్టి, కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసిండు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నాకు దక్కనిది వేరే ఎవరికీ దక్కొద్దని, నాకు జరిగింది నీకు కూడా జరగాలనే మనస్తత్వంతో ఎట్టిపరిస్థితుల్లో మమ్మల్ని జైల్లో పెట్టాలనే ఆలోచనతో ఉన్నాడు' అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ నేతలకు పరిపాలన చేతకాదని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దమ్ము లేదని విమర్శించారు. దద్దమ్మ రాజకీయాలతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

### తెలంగాణ కోసం అవసరమైతే జైలుకెళ్తా

'ఒకవేళ ప్రభుత్వ పెద్దల నుంచి, పై నుంచి నన్ను అరెస్ట్ చెయ్యాలని ఒత్తిడి మీకు ఉంటే బేషుగ్గా అరెస్టు చేసుకోవచ్చని ఏసీబీ అధికారులకు చెప్పా. ఇప్పుడు కూడా మళ్లీ చెప్తున్నా. తప్పు చేయలేదు. తలదించుకోలేదు. అవసరమైతే తెలంగాణ కోసం మరోసారి జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధం. రేవంత్ ఉడుత ఊపులకు భయపడేవారు ఎవరూ బీఆర్ఎస్‌లో లేరు' అని కేటీఆర్ పేర్కొన్నారు. పైసా అవినీతి లేని ఈ కేసులో ఏసీబీతో విచారణ జరపడం దద్దమ్మ రాజకీయంగా కేటీఆర్ అభివర్ణించారు. అక్రమ కేసుల్లో తమకు నోటీసులు రావడం పాత చింతకాయ పచ్చడిలా మారిందన్న కేటీఆర్ బీఆర్ఎస్ క్యాడర్ వీటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. 'పెడితే ఒక 15 రోజులు నన్ను జైల్లో పెట్టి రేవంత్‌రెడ్డి పైశాచికానందం పొందడం తప్ప ఇంకేం చేయలేడు' అని అన్నారు. 'నాపై ఇప్పటికే 14 కేసులు పెట్టావ్. ఇంకా 1400 కేసులు పెట్టుకో. అవసరమైతే జైల్లో పెట్టుకో. భయపడేది లేదు. తెలంగాణ కోసం ఆనాడు జైలుకు పోయినం. తెలంగాణ ప్రతిష్ఠ పెంచడానికి తీసుకున్న ఒక నిర్ణయం వల్ల మళ్లా జైలుకు పోవడానికి భయపడేది లేదు' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

### అలా అనకపోతే ఇంకేమనాలి?

'నీలా రూ.50 లక్షల బ్యాగుతో దొరికిన దొంగలెవరూ మా పార్టీ లేరు' అని కేటీఆర్ ఘాటుగా స్పందించారు. 'నేనేదో అన్నందుకు సీఎం చాలా బాధపడ్డడట. తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యుండి 'జై తెలంగాణ' అని అనకపోతే ఏమనాలి?' అని కేటీఆర్ ప్రశ్నించారు. 'తెలంగాణ రాష్ట్రాన్ని ప్రతిరోజు కించపరిస్తే ఏమనాలి? దివాలా రాష్ట్రమంటే ఏమనాలి? ఢిల్లీకి పోతే అపాయింటమెంట్ ఇస్తలేరు, దొంగను చూసినట్టు చూస్తున్నారనంటే ఏమనాలి' నిలదీశారు. ప్రస్తుతం ఏసీబీ కేసులు ఒక డైలీ సీరియల్లా మారాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఉదయం నుంచి ఓపికగా తనకోసం ఎదురుచూసిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులకు, మీడియా మిత్రులకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

> ఫైలు ఎటుపోయింది? నువ్ కుడిచేతులకెళ్లి ఇచ్చినవా? ఎడమ చేతిలకెళ్లి ఇచ్చినవా? అని పనికిమాలిన ప్రశ్నలు. చిట్టినాయుడు రాసిచ్చిన ప్రశ్నలే తప్ప వాటిలో విషయంలేదు. - కేటీఆర్

# కేటీఆర్ వ్యక్తి కాదు.. సమూహ శక్తి

- తుమ్మినా, దగ్గినా కేసు పెడుతుండు
- 18 నెలల్లో 14 కేసులు పెట్టిండు
- కేటీఆర్‌ను ముట్టుకుంటే భస్మమైపోతవ్
- రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు స్ట్రాంగ్ వార్నింగ్



హరీశ్‌రావుతో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): కేటీఆర్ ఒక వ్యక్తి కాదని, లక్షల మంది కార్మికుల సమూహశక్తి అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'లక్షలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, కుటుంబ సభ్యుల అండ ఉన్న కేటీఆర్‌ని ముట్టుకుంటే భస్మమైపోతావ్ రేవంత్‌రెడ్డీ, తస్మాత్ జాగ్రత్త' అని హరీశ్‌రావు హెచ్చరించారు. సోమవారం ఏసీబీ విచారణ పూర్తి చేసుకొని తెలంగాణ భవన్‌కు చేరుకున్న కేటీఆర్‌ను హరీశ్‌రావు ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి తన వైఫల్యాలను, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ తన 18 నెలల పాలనలో కేటీఆర్‌పై 14 కేసులు పెట్టారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, 420 హామీల ఊసే లేదని, మాట తప్పినందుకు రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. 'దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాట తప్పిన నిన్ను ఏం చేయాలి రేవంత్‌రెడ్డి?' అని ప్రశ్నించారు.

### కేటీఆర్ పరువు నిలబెడితే.. నువ్ పరువు తీశావ్

దేశంలోని అనేక రాష్ట్రాలు ఫార్ములా ఈ రేసింగ్ కోసం పోటీపడుతుంటే కేటీఆర్ తన శక్తియుక్తులు ఉపయోగించి హైదరాబాద్‌కు దానిని తీసుకొచ్చి, రాష్ట్ర గౌరవాన్ని పెంచారని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్‌రెడ్డి మాత్రం అందాల పోటీలతో రాష్ట్రం, దేశం పరువును తీశారని, మన కీర్తిని మంటగలిపారని ఆరోపించారు.

### తుమ్మినా దగ్గినా కేసులేనా?

రేవంత్‌రెడ్డి పాలనలో తుమ్మినా, దగ్గినా కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. 'కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టో, బీఆర్ఎస్ కార్యకర్తలను కష్టపెట్టో, వారి కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టో, సోషల్ మీడియా వారియర్స్‌ను కష్టపెట్టో, కేసులు పెట్టో అటెన్షన్‌ను డైవర్ట్ చేద్దామనుకుంటుండు' అని హరీశ్‌రావు అన్నారు. 'కమీషన్లను ఎత్తిచూపితే కేసులు, నీ అరాచకాలను ఎత్తిచూపితే కేసులు, లగచర్ల రైతులకు బేడీలేసిన కేసులను ఎత్తిచూపితే, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నావ్. జాగ్రత్త' అని రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు.

### హరీశ్‌రావుకు అస్వస్థత.. దవాఖానలో చేరిక

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 16 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి హరీశ్‌రావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కేటీఆర్ ఏసీబీ విచారణ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెలంగాణ భవన్‌లో ఉన్న హరీశ్‌రావు ఒక్కసారిగా నీరసించి, అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే బేగంపేటలోని సన్‌షైన్ కిమ్స్ దవాఖానకు తరలించారు. నీరసం, జ్వరం మినహా హరీశ్‌రావు ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. అస్వస్థతతో దవాఖానలో చేరిన హరీశ్‌రావును మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని యథావిధిగా ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు.



### పాలన చేతగాకే కేసులు

**కేసులు, కమీషన్లే రేవంత్ సర్కారు విధానం**

**శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం**

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : నయవంచన, మోసానికి కేరాఫ్ కాంగ్రెస్ అని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసులు, కక్షలు, కమీషన్లే రేవంత్ సర్కారు విధానమని నిప్పులు చెరిగారు. పాలన చేతగాక, పథకాలను అమలుచేయలేక, అభివృద్ధి కొనసాగించలేక బీఆర్ఎస్ నేతలపై కక్ష సాధింపులకు దిగుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 'ఫార్ములా ఈ రేసు వ్యవహారంలో ఎలాంటి అవినీతి జరగలేదు. కేటీఆర్ ఖాతాలో నయాపైసా ప్రజాధనం చేరలేదు. అయినా ప్రభుత్వం అవినీతి నిరోధక శాఖతో విచారణ చేపట్టడం హాస్యాస్పదం' అని విమర్శించారు. ఫార్ములా రేసుతో కేటీఆర్ రాష్ట్ర ప్రతిష్ఠను పెంచితే అందాల పోటీలతో రేవంత్ పరువు తీశారని మండిపడ్డారు. ఈ పోటీలు నిర్వహించి మహిళల ఆత్మగౌరవం మంటగలిపిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని ఎద్దేవా చేశారు. తనను వేశ్యలా చూశారని మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఏకంగా ఆ పార్టీ అధినేత సోనియాకే ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అయినా, ప్రభుత్వం పట్టింపులేనితనంతో వ్యవహరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలపై దూషణలు మాని ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోటా ఇవ్వకుండా ప్రభుత్వం దగా చేస్తున్నదని శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. బీసీ సంఘాలు ఏకమై వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# ఇది ముమ్మాటికీ అక్రమ కేసే!

**వందసార్లు అడిగినా అవే చెప్తా • ఏసీబీ ప్రశ్నలకు కేటీఆర్ జవాబు**

- అడిగి ప్రశ్నలే అడిగిన అధికారులు
- అయినా 8 గంటలపాటు విచారణ!
- కేటీఆర్ ఫోన్ల స్వాధీనానికి యత్నం
- గతంలో వాడిన ఫోన్లను 18న సమర్పించాలన్న ఏసీబీ!
- త్వరలో అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డికి నోటీసులు!
- ఇదే కేసులో మరోసారి కేటీఆర్‌ను విచారించే అవకాశం!

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : 'మీరు పదే పదే అవే ప్రశ్నలు అడిగినా, నా దగ్గర ఉన్న సమాచారం ఒక్కటే. ఇది ముమ్మాటికీ అక్రమ కేసు. అవినీతే లేని కేసును ఏసీబీ ఎలా టేకప్ చేస్తుంది? అవసరమైతే లై డిటెక్టర్ టెస్టుకైనా నేను సిద్ధమే. ఒకవేళ నన్ను జైలుకు పంపాలన్నది ప్రభుత్వ ఉద్దేశమే అయితే ఈ డొంకతిరుగుడంతా ఎందుకు? నేరుగా నన్ను అరెస్టు చేసుకోవచ్చు. తెలంగాణ కోసం ఎన్నిసార్లయినా జైలుకు వెళ్లేందుకు సిద్ధంగానే ఉంటా. మీరు ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వస్తా' అని ఏసీబీ అధికారులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చి చెప్పారు. ఫార్ములా-ఈ రేస్‌కు స్పాన్సర్లు రాకుంటే రేస్ నిర్వహణకు నిధులు ఇవ్వాలని హెచ్ఎండీఏకు తానే మౌఖిక ఆదేశాలు ఇచ్చానని పదేపదే చెప్పిన విషయాన్ని, మీడియా సమక్షంలో చెప్పిన అంశాలను ఏసీబీ అధికారులకు కేటీఆర్ చెప్పినట్టు తెలిసింది. 'ఒక ప్రభుత్వం నుంచి మరో ప్రభుత్వానికి వెళ్లిన నిధుల్లో అవినీతి ఎక్కడుందో మీరే చెప్పాలి? పైగా ఆ డబ్బులు కూడా ఎక్కడికీ వెళ్లలేదు' అని ఏసీబీ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారని సమాచారం. ఈ క్రమంలో కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు గతంలో అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడిగినట్టు తెలిసింది. అయిప్పటికీ వారు అడిగిన 60కి పైగా ప్రశ్నలకు కేటీఆర్ ఎంతో ఓపికతో సమాధానం ఇచ్చారని సమాచారం.

### ఉదయం 10 గంటల నుంచి విచారణ

సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ కార్యాలయానికి చేరుకున్న కేటీఆర్‌ను ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి పర్యవేక్షణలో జాయింట్ డైరెక్టర్ రుతిరాజ్, విచారణాధికారి డీఎస్పీ మాజిద్‌ఖాన్ నేతృత్వంలోని విచారణ బృందం సుమారు 8 గంటలపాటు ప్రశ్నించింది. మధ్యాహ్నం లంచ్ బ్రేక్ ఇచ్చిన అధికారులు మళ్లీ విచారణ కొనసాగించారు. లాయర్ రామచంద్రరావుతో కలిసి కేటీఆర్ విచారణకు హాజరయ్యారు. గతంలో ఇదే కేసులో సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్‌తోపాటు, హెచ్ఎండీఏ మాజీ కమిషనర్ దానకిషోర్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నలు అడిగారు. రెండో విడత కూడా మళ్లీ అవే పాత ప్రశ్నలు అడిగినా వారు అడిగిన అన్ని ప్రశ్నలకు కేటీఆర్ సూటిగా సమాధానం ఇచ్చినట్టు తెలిసింది.


### ఊహాజనిత ప్రశ్నలతో లాభం లేదు

'ఈ మొత్తం ప్రక్రియలో చట్ట వ్యతిరేకమైన అంశం ఏదీ లేదు. ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి లోటుపాట్లు ఉంటే ప్రభుత్వ పరమైన విచారణ చేస్తే సరిపోతుంది. ఎక్కడా పైసా అవినీతి లేనప్పుడు ఇందులో చట్టవ్యతిరేకత ఎక్కడుంది?' అని కేటీఆర్ ఏసీబీ అధికారులకు చెప్పినట్టు తెలిసింది. 'మీరు ఈ కార్యాలయంలో ఎన్ని గంటలు కూర్చోమన్నా కూర్చుంటాను. ప్రభుత్వం నన్ను అరెస్టు చేయమని ఆదేశాలు ఇస్తే ఈ ప్రశ్నలు అడగడం అనేది వృథా ప్రయాస' అని కేటీఆర్ చెప్పినట్టు సమాచారం. 'మీరు పదేపదే అవే ప్రశ్నలు అడిగితే నా సమాధానం కూడా అదే. ఎలాంటి ఆధారాలు లేకుండా ఊహాజనితంగా ప్రశ్నలు అడగడం వలన ఈ కేసు విచారణ ముందుకు పోదు. ఎన్ని ప్రశ్నలు అడిగినా లాభం లేదు' అని కేటీఆర్ సమాధానం ఇచ్చినట్టు తెలిసింది.

### ఫోన్లు స్వాధీనం చేసుకునే యత్నం

కేటీఆర్ సమాధానాలతో సంతృప్తి చెందని ఏసీబీ అధికారులు కేటీఆర్ ఫోన్లను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించినట్టు తెలిసింది. ఆయన మునిసిపల్‌శాఖ మంత్రిగా 2023లో రేస్ నిర్వహించే నాటికి వాడిన ఫోన్లను తమకు అప్పగించాలని ఆదేశించినట్టు సమాచారం. వాటిని ఈనెల 18న తమకు సమర్పించాలని కోరినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఈ కేసును మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరోసారి ఏసీబీ నోటీసులు అందించే అవకాశం ఉంది. మళ్లీ వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసి, అవసరమైతే కేటీఆర్‌ను మళ్లీ విచారణకు రమ్మని పిలిచే అవకాశాలు ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

## లోకం పోకడ




## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 36.9°c | 24.2°c |
| నల్లగొండ | 36.5°c | 24.8°c |
| రంగారెడ్డి | 33.8°c | 21.3°c |
| నిజామాబాద్ | 33.1°c | 25.6°c |
| వరంగల్ | 33.0°c | 25.0°c |
| ఖమ్మం | 33.0°c | 27.0°c |
| కరీంనగర్ | 33.0°c | 27.0°c |
| మెదక్ | 32.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 31.4°c | 22.6°c |
| మహబూబ్‌నగర్ | 31.0°c | 24.0°c |

### వచ్చే నాలుగురోజులు వర్షాలు

**హైదరాబాద్ వాతావరణశాఖ**

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం గుజరాత్ దాని సమీప ప్రాంతంలో సగటు సముద్రమట్టం నుంచి 7.6 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగురోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. సోమవారం ఉరుములు, మెరుపులతో గంటకు 30-40 కి.మీ ఈదురుగాలుల వేగంతో కూడిన వర్షాలు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ కురిసినట్టు తెలిపింది.

### సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఫార్ములా- ఈ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు ఏసీబీ నోటీసులు జారీ చేసి విచారణకు పిలవడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు సోమవారం పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. - ఓదెల



### ప్రశ్నించే గొంతుకలపై రేవంత్ కత్తి: జీవన్‌రెడ్డి

'ప్రశ్నించే గొంతుకలపై రేవంత్ సర్కారు కత్తిపెడుతున్నది..కేసులు పెడుతూ వేధిస్తున్నది' అంటూ ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడబోదని ఒక ప్రకటనలో తేల్చిచెప్పారు. సర్కారు అక్రమాలను ఎండగడుతున్నందుకే కేటీఆర్‌పై కక్ష సాధిస్తున్నదని దుయ్యబట్టారు.

# యూరప్ పర్యటనలో అర్వింద్‌కుమార్

**ఏప్రిల్ 15నే సెలవులు మంజూరు చేసిన ప్రభుత్వం**

**కనిపించకుండా పోయారని ఎంపీ చామల ఆరోపణ**

**ఫార్ములా రేసుపై బురదజల్లడమే పనిగా వ్యవహారం**

హైదరాబాద్, జూన్ 16(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర రెవెన్యూ(విపత్తుల నిర్వహణ)శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ యూరప్ పర్యటనకు వెళ్లారు. ఆయన తన కూతురు గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొనేందుకు వెళ్తున్నట్టు ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. జూన్ 2 నుంచి 30 వరకు వ్యక్తిగత సెలవులు మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వానికి పెట్టుకున్న దరఖాస్తును ఆమోదిస్తూ ఏప్రిల్ 15న నాటి సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో అప్పటి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అర్వింద్ కుమార్ విదేశీ పర్యటనకు వెళ్లడాన్ని కాంగ్రెస్ రాజకీయం చేసే ప్రయత్నం చేసింది. అర్వింద్‌కుమార్ కనిపించకుండా పోయారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ప్రభాకర్‌రావు మాదిరిగానే అర్వింద్ కుమార్ కూడా విదేశాలకు వెళ్లినట్టు గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొనడం గమనార్హం. ఫార్ములా రేసుపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ నేతలు అర్వింద్‌కుమార్‌పై బట్టకాల్చి మీద వేయడం చర్చనీయాంశంగా మారింది.